

జూరాలకు భారీ వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.14 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది.

వివరాలు 8లో ▸



పింఛన్లు పెంచకపోతే..

పింఛన్లు పెంచకపోతే సీఎం రాజీనామా చేయాలని మందకృష్ణ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /21.6

ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ల భర్తీకి చర్యలు

బిజినేపల్లి: పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో 2025– 26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ విద్యార్థులకు తరగతులు బోధించేందుకు ఆయా సబ్జెక్టుల్లో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులకు గాను మంగళవారం వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాని, సెల్ నం.98484 66603ను సంప్రదించాలని సూచించారు.

ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండదిగువన ఉన్న భోగమహేశ్వరం ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక దృష్టిసారించి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను పలుమార్లు కలిసి ఆలయ అభివృద్ధి కోసం సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించారన్నారు. నిధుల మంజూరుకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణకు చైర్మన్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామంలో జేష్ఠాదేవి సమేతంగా వెలసిన శనేశ్వరుడికి భక్తులు తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం తిలతైలాభిషేకాలతో పూజలు చేశారని ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ముందుగా శనేశ్వరునికి పూజలు చేశారు. అనంతరం బ్రహ్మసూత్ర పరమశివుడికి రుద్రాభిషేకాలు, పూజలు చేసిన అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ కింద బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం ఏదైనా రంగంలో డిగ్రీ, పీజీలో 50 శాతం మార్కులు ఉండి, 25 ఏళ్లలోపు, వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించకూడని వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను వచ్చేనెల 18లోగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.



నల్లమలలోని అప్పాపూర్ పెంటలో చెంచులు నివసించే బొడ్డు గుడిసెలు

చెంచులకు.. ఇందిరమ్మ ఇల్లు

ఇల్లు లేని ప్రతి చెంచుకు కేటాయించాలని ప్రభుత్వ నిర్ణయం

- జిల్లాలో ఇప్పటికే 536 కుటుంబాలకు మంజూరు పత్రాల పంపిణీ
- తప్పనున్న బొడ్డు గుడిసెల్లో నివాసం బాధ
- నల్లమలలోని చెంచుల తరలింపు నేపథ్యంలో ఇళ్ల నిర్మాణంపై సందిగ్ధం
- ఏళ్లుగా క్షేత్రస్థాయిలో లబ్ధి పొందలేకపోతున్న గిరిపుత్రులు

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమలలోని ప్రతి చెంచు కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బొడ్డు గుడిసెల్లో నివసించే చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం పక్కా ఇళ్ల నిర్మాణంతో మేలు చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెంచులకు మొత్తం 13,266 ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇందులో మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో మొత్తం 2,156 ఇళ్లు నిర్మించనుంది. ఈ మేరకు ఇటీవల అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు చెంచులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు. తొలి విడతగా 536 మంది చెంచు కుటుంబాలకు ఇళ్లు నిర్మించేందుకు కసరత్తు ప్రారంభమైంది.

తొలివిడతలో 890 మందికి..

జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో నివసించే చెంచులకు తొలివిడతలో మొత్తం 890 కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 536 మంది చెంచు కుటుంబాలకు ఇళ్ల పట్టాలను సైతం అందజేశారు. వీటిలో అమ్రాబాద్ మండలంలో మన్ననూర్, మాచారం, అచ్చంపేట మండలంలోని అక్కారం, చందాపూర్, పులిబీగలబండ, ఐనోలు, చౌటపల్లి, గుంపన్‌పల్లి, లింగాల మండల కేంద్రంతోపాటు అప్పాయపల్లి, ఎర్రపెంట, పద్మనపల్లి, వడ్డెరాయవరం, ధారారం, సూరాపూర్, బల్మూర్ మండలంలో బిళ్లకల్, అంబగిరి, చెంచుగూడెం, బల్మూర్, పదర మండలంలోని పెట్రాల్‌చేను, చిట్లంకుంట, వంకేశ్వరం, మద్దిమడుగు, పల్లెరూట్ పెంట, కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్, అమరగిరి, మొలచింతలపల్లి, పెద్దకొత్తపల్లి మండలంలోని యాపట్ల, దేదినేనిపల్లి, మారేడుమాన్ దిన్నె, మరికల్ గ్రామాల్లోని చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. త్వరలోనే ఆయా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చెంచులకు కేటాయించనున్న ఇళ్లు ఇలా..		
అచ్చంపేట	కొల్లాపూర్	కల్వకుర్తి
785	105	120

మన్ననూర్ ప్రాజెక్ట్ పరిధిలో..

ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. అచ్చంపేట నియోజకవర్గానికి అదనంగా 500 నుంచి 700 ఇళ్ల వరకు మంజూరు చేయనున్నట్టు చెబుతున్నారు. అదనంగా నిర్మించనున్న ఇళ్లను చెంచులకు కేటాయించనున్నారు. అలాగే ప్రత్యేకంగా మన్ననూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ పరిధిలోని చెంచులకు 2,156 ఇళ్లు నిర్మించనున్నారు. నల్లమలలోని కొండలు, గుట్టల్లో బొడ్డు గుడిసెల్లో నివసించే చెంచులకు ఇప్పటి వరకు ఆర్డీటీ ఇతర స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం సైతం చెంచులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనుండటంతో పెద్ద సంఖ్యలో లబ్ధిచేకూరనుంది.

చెంచులకు ప్రాధాన్యత..



జిల్లాలోని చెంచులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించింది. జిల్లావ్యాప్తంగా 11,622 ఇళ్లు మంజూరు చేయగా.. వీటిలో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచులకు 890 ఇళ్లు మంజూరయ్యాయి. తొలివిడతలో భాగంగా మొత్తం 536 మంది చెంచు కుటుంబాలకు పట్టాల పంపిణీ పూర్తయ్యింది. ప్రభుత్వ నిబంధనల మేరకు మిగతా వారికి పట్టాల పంపిణీ చేపడతాం.

– బదావత్ సంతోష్, కలెక్టర్

నట్టడవిలో నిర్మాణంపై సందిగ్ధం..

చెంచులందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్న ప్రభుత్వం తొలి విడత పట్టాల పంపిణీలో మైదాన ప్రాంతాలు, నల్లమల అటవీ పరిసర ప్రాంతాల్లోని చెంచు కుటుంబాలకు మాత్రమే అవకాశం కల్పించింది. నల్లమలలో చెట్ల మధ్యన బొడ్డు గుడిసెల్లో అరకొర వసతులతో నివసిస్తున్న వారికి ఇళ్ల కేటాయించకపోవడంతో అక్కడ ఇళ్ల నిర్మాణంపై సందిగ్ధం నెలకొంది. వాస్తవానికి నల్లమల కోర్ ఏరియాలోని చెంచు పెంటల్లో నివసిస్తున్న చెంచులు ఇంకా దుర్భర పరిస్థితుల్లోనే జీవనం సాగిస్తున్నారు. సరైన ఇళ్లు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, పోషకాహారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేపడుతున్నా చాలా వరకు చెంచులు లబ్ధి పొందలేకపోతున్నారు. ఇప్పుడు ఇందిరమ్మ పథకంతో వారికి పక్కా ఇళ్లు సమకూరాల్సి ఉండగా.. ఈ మేరకు వారికి కేటాయింపు ఉంటుందా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే దట్టమైన అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచులను అడవి బయట మైదాన ప్రాంతాలకు తరలించి, పునరావాసం కల్పించేందుకు కసరత్తు మొదలైంది. మొదటి విడతలో సార్లపల్లి, కుడిచింతల్‌బైల్, వటువర్లపల్లి గ్రామాలను తరలించనుండగా.. తర్వాత కొమ్మన్‌పెంట, కొల్లంపెంట గ్రామాలను సైతం రీలొకేషన్ చేయనున్నారు. ఈ క్రమంలో అప్పాపూర్, భౌరాపూర్, సంగిడిగుండాల, మేడిమల్కల, రాంపూర్, అగర్లపెంట తదితర చెంచుపెంటల్లో నివసిస్తున్నవారి పరిస్థితి ఏమిటన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సర్దుబాటు దిశగా..

ఉపాధ్యాయుల కేటాయింపుపై అధికారుల దృష్టి



దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

- విద్యార్థుల సంఖ్య ఆధారంగా బదిలీ చేసేందుకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 450 వరకు డిప్యుటేషన్లు చేసే అవకాశం
- అడ్డగోలుగా కాకుండా కలెక్టర్ల అనుమతితో ఆర్డర్లు?
- పాఠశాలల్లో కొరత లేకుండా చూస్తామన్న విద్యాధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నివారించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఈ నెల 15 వరకు పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల ఆధారంగా టీచర్లను సర్దుబాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల బడుల్లో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ అందులో విద్యార్థులు లేకపోవడం, కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండి.. ఉపాధ్యాయులు తక్కువగా ఉండడం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇబ్బందులను అధిగమించేందుకు ఉపాధ్యాయులను కేటాయించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికారులు దృష్టిసారించారు. ఇప్పటికే జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు, ప్రభుత్వం సూచించిన సంఖ్య కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. గతేడాది ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపట్టినా.. మరికొన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడం, గతేడాది కాలంలో కొంతమంది ఉపాధ్యాయులు రిటైర్డ్ కావడం వంటి సమస్యలతో పోస్టులు ఖాళీ అయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 3 వేల పాఠశాలలు ఉండగా.. 2.62 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

హైస్కూళ్లలో భిన్న పరిస్థితి..

ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి హైస్కూల్ వరకు ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియాలు బోధిస్తుంది. ఈ క్రమంలో గతంలో తెలుగు మీడియం పోస్టుల ద్వారా భర్తీ అయిన ఉపాధ్యాయులు ప్రస్తుతం ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులకు బోధిస్తున్నారు. తెలుగు మీడియం వారు ప్రారంభంలో ఇంగ్లిష్‌లో బోధించేలా శిక్షణ ఇచ్చినా పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయారన్న వాదనలు ఉన్నాయి. వీటితోపాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే విద్యార్థుల సంఖ్యకు ఆధారంగా సర్దుబాటు చేసే అవకాశాలు ఉండగా, ఉన్నత పాఠశాలల్లో మాత్రం ఎంతమంది విద్యార్థులు ఉన్నా ప్రతి సబ్జెక్టుకు ఒకరు చొప్పున ఉపాధ్యాయులు తప్పకుండా ఉండాలి. కానీ, మంజూరైన పోస్టులలో ఒకటి కంటే ఎక్కువ పోస్టులు ఉంటే మాత్రమే డిప్యూటేషన్ ఇచ్చే అవకాశం ఉంది. అయితే చాలా పాఠశాలల్లో సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులే లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరి దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లు ఇలా..		
1 నుంచి 10 వరకు ఒకరు	11 నుంచి 60 వరకు ఇద్దరు	61 నుంచి 90 వరకు ముగ్గురు
91 నుంచి 120 వరకు నలుగురు	121 నుంచి 150 వరకు ఐదుగురు	151 నుంచి 200 వరకు ఆరుగురు

అక్రమాలకు తావులేకుండా..

గతంలో కూడా విద్యా సంవత్సరం ప్రారంభంలో బడుల్లో ఉపాధ్యాయుల సంఖ్య సర్దుబాటు చేసేందుకు డిప్యూటేషన్లు చేపట్టారు. ఇందులో ఎలాంటి ఆర్డర్స్ లేకుండా నేరుగా స్కూల్ కాంప్లెక్స్, ఎంఈఓ పరిధిలో నేరుగా ఓరల్ డిప్యూటేషన్లు ఇచ్చి అడ్డగోలుగా చేపట్టడంతో విద్యాశాఖపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈసారి కలెక్టర్ అనుమతితో డిప్యూటేషన్ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఒక సంవత్సర కాలానికి ఆర్డర్స్ ఇవ్వనున్నారు. దీంతో ఎలాంటి అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 450 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్ల ద్వారా బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లాల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలు				
జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు	జీ.ఎ.స్కూ
మహబూబ్‌నగర్	791	62,724	4,650	29
నాగర్‌కర్నూల్	808	54,152	3,513	57
వనపర్తి	495	38,147	2,097	29
జోగుళాంబ గద్వాల	448	55,289	2,064	10
నారాయణపేట	458	52,314	1,879	36



జీ.ఎ.స్కూ: జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు

ఒత్తిళ్లకు తలొగ్గొద్దు..



జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం చేపడుతున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్ పారదర్శకంగా జరగాలి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు ఇవ్వొద్దు. చాలా మంది ఉపాధ్యాయులు రాజకీయ నాయకులను, పలుకుబడిన సంఘాలను సంప్రదించి తనకు నచ్చిన దగ్గర పోస్టింగ్ తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ విద్యాశాఖ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా జరగాలి.

– రాజిరెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు

పారదర్శకంగా నిర్వహిస్తాం



జిల్లాలో ఉపాధ్యాయులకు సంబంధించి వర్క్ అడ్జస్ట్‌మెంట్ డిప్యూటేషన్‌పై ఇంకా కసరత్తు కొనసాగుతుంది. మండలాల నుంచి పూర్తి సమాచారం విద్యాశాఖ కార్యాలయానికి చేరలేదు. సమాచారం వచ్చిన తర్వాత ఎంతమందిని వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలనేది పూర్తిగా తెలుస్తుంది. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తాం. – రమేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

కందనూలు: జిల్లాకేంద్రంలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహాన్ని శనివారం రాత్రి కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం నాణ్యతను గురించి తెలుసుకున్నారు. హాస్టల్‌లో సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలు, ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారని ఆరాతీశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తెచ్చిన పలు సమస్యలపై ఆయన స్పందిస్తూ త్వరలోనే వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులు బాగా చదువుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఆర్టీసీలో అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని వివిధ ఆర్టీసీ డిపోలలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ విభాగాల్లో మూడేళ్ల అప్రెంటిస్ శిక్షణకు ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్‌ఎం సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేటకు చెందిన వారు గ్రాడ్యుయేషన్ ఇంజినీరింగ్ ఇన్ ఐటీ/ కంప్యూటర్ సైన్స్/ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ గణితం కోర్సులలో లేదా డిప్లొమా 2021 నుంచి పాసై ఉండాలన్నారు. ఇక నాన్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌కు బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. దరఖాస్తులను నాట్స్ (నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీం) https://nats.education.gov.in వెబ్‌పోర్టల్‌లో ఈ నెల 21 నుంచి 27 వరకు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, శిక్షణ కాలంలో ప్రతినెలా స్టైఫండ్ ఇస్తామని తెలిపారు.

ఉపాధి కూలీలకు బీమా



తిమ్మాజిపేట మండలం మరికల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ప్రధానమంత్రి సురక్ష యోజన అమలు

- బీమా లేని వారిని గుర్తించే పనిలో అధికారులు
- వందశాతం సౌకర్యం కల్పించేందుకు చర్యలు
- జిల్లాలో 1,69,870 మంది కూలీలు

నాగర్‌కర్నూల్: గ్రామాల్లో వలసలు నివారించి ప్రతిఒక్కరికీ స్థానికంగా ఉపాధి కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ పథకం ద్వారా కూలీ ఉపాధి పొందుతుండగా వారికి మరో ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధాన మంత్రి సురక్ష పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. కూలీలతో కొంత ప్రీమియం సొమ్ము చెల్లింపజేసి వారికి బీమాను కల్పించేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందుకోసం ఇప్పటికే ఉపాధి హామీలో ఉన్న కూలీలకు ఎవరెవరికి బీమా ఉంది.. లేనివారితో చేయించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు జిల్లాలో కూలీలకు ఎవరెవరికి బీమా లేదనే వివరాలను సేకరించి వారిని బీమా చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఖాతా నుంచి రూ.20 జమ

జిల్లాలో మొత్తం 1,11,181 యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా.. ఇందులో 1,69,870 మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరందరికి ఈ బీమా వర్తించనుంది. సురక్ష బీమా యోజన కోసం 18 నుంచి 71 ఏళ్లలోపు వారు జాతీయ బ్యాంకుల్లో పేరు నమోదు చేసుకోవాలి. ఈ ఖాతా ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి. బ్యాంకు ఖాతా ఉన్న బ్రాంచ్‌లో ఖాతా నుంచి ఏటా రూ.20 బీమాకు జమ చేయాలని అంగీకార పత్రం ఇవ్వాలి. పేరు నమోదు చేసుకున్న వారు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించినా.. పూర్తి అంగవైకల్యం కలిగినా వారికి రూ.2 లక్షల పరిహారం పొందే అవకాశం ఉంటుంది. పాక్షికంగా అంగవైకల్యం కలిగిన రూ.లక్ష పరిహారం అందుతుంది. అయితే కూలీలకు బీమా చెల్లింపు సమస్యగా మారింది. కచ్చితంగా బ్యాంకుకు వెళ్లి నమోదు చేసుకోవాలి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకులు దూరంగా ఉండడంతో నిరక్షరాస్యులకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. చాలామంది కూలీలు తమ వేతనాలను సీఎస్సీ కేంద్రాల ద్వారా తీసుకుంటారు. కాగా బీమా పొందాలంటే వేతనదారుడి ఇంటి పేరుతోపాటు తండ్రి, భర్త, వయస్సు, బ్యాంక్ ఖాతా, ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయాలి. వేతనదారుల నుంచి ఉపాధి సిబ్బంది అనుమతి పత్రం సేకరించి బ్యాంకుల్లో అందజేయాలి. ప్రతిరోజు పథకం కింద నమోదైన వివరాలు జిల్లా ఉపాధి కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. కాగా వందశాతం కూలీలకు ఈ బీమా సౌకర్యం కల్పించేలా ఉపాధి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నిరంతరం ప్రక్రియ..

ఉపాధి కూలీలకు బీమా అనేది నిరంతరం ప్రక్రియ దీనికి చివరి తేదీ అంటూ ఏమీ లేదు. జిల్లాలో ఎవరెవరికి బీమా లేదన్న విషయాన్ని బ్యాంకుల వద్ద సేకరించి వారికి బీమా కల్పించేలా ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రతి ఒక్కరికి బీమా కల్పించడమే లక్ష్యంగా కూలీలకు సైతం అవగాహన కల్పిస్తున్నాం.

– ఓబులేసు, డీఆర్‌డీఓ

చినుకు పడితే చిత్తడే!

- జల్లులకే రోడ్డు బురదమయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

– చారకొండ



వివరాలు 9లో ▶

రేపు 'రేపటి కాలం' కవిత్వం ఆవిష్కరణ

కందనూలు: కవిసంగమం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎదిరేపల్లి కాశన్న రచించిన రేపటికాలం కవిత్వం ఆవిష్కరణ సభ సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు నెలపొడుపు సాహిత్య వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ప్రజాకవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ కాశీం, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి ఆనందచారి తదితరులు హాజరవుతారన్నారు. విద్యార్థులు, మేధావులు, శ్రేయోభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో ఒప్పంద ప్రాతిపదికన వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ విజయేందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్లలోని ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ 1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 1 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన ఏడాది కాలానికి భర్తీ చేస్తామన్నారు. అభ్యర్థుల సేవల నాణ్యతపై ఆధారపడి నియామక కాలాన్ని పొడిగించే అవకాశం ఉందన్నారు. అలాగే సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టు కోసం అనస్తీషియా, జనరల్ సర్జన్, ఫొరెన్సిక్ మెడిసిన్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ పోస్టులో ఎంపికైన వారికి రూ.లక్ష వేతనం ఉంటుందన్నారు. అదే సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఒక పోస్టుకు ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి జీతం రూ.52,351 చెల్లిస్తామన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థిని బలవన్మరణం

జడ్చర్ల: స్థానిక బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని నిఖిత(18) శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. స్థానిక గాంధీ నగర్‌లో నివాసముంటున్న ఇమ్మడి రమేశ్, మాధవి దంపతులు సిగ్నల్‌గడ్డ వద్ద మిర్చి బండి నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ప్రతిరోజులాగే మిర్చిబండి నిర్వహణ ముగిసిన తర్వాత రాత్రికి ఇంటికెళ్లి చూడగా.. తన కూతురు బెడ్రూంలో చీరతో ఉరి వేసుకుని కనిపించగా.. వెంటనే జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. తమ కూతురు మృతికి కారణం ఏమిటో తెలియదని శనివారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని బాలుడు ఆత్మహత్య

నవాబుపేట: పురుగుల మందు తాగి మతిస్థిమితం లేని బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జంగమయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన ముష్టి సుధాకర్ కుమారుడు గౌతం(16) చిన్న తనం నుంచే మతిస్థిమితం లేక తిరుగుతుండేవాడు. తాజాగా గురువారం గౌతం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లి పొలం గట్టుపై ఉన్న కలుపు మందు డబ్బాను తీసుకుని తాగేశాడు. దీంతో అక్కడ ఉన్న వారు ఆలస్యంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ విషయంలో అతని తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. రైల్వే ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని బొక్కలోనిపల్లి సమీపంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వేగంగా వెళ్తున్న రైలు కింద తల పెట్టడం వల్ల తల, మొండెం భాగం పూర్తిగా వేరయి అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదని, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

క్షణికావేశంలో పురుగు మందు తాగిన మహిళ

గోపాల్‌పేట: భార్యాభర్తలు గొడవపడి క్షణికావేశంలో పురుగుమందు తాగిన మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని జింకలబీడు తండాలో శనివారం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. జింకలబీడు తండాకు చెందిన శాంతి (36), కేతావత్ పాండు భార్యాభర్తలు. వారికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారు కోళ్ల షెడ్డు వద్ద శనివారం గొడవ పడ్డారు. దీంతో క్షణికావేశంలో ఆమె పురుగుల మందు తాగింది. వెంటనే భర్త ఆమెను వనపర్తి ఆస్పత్రికి తీసుకువెళ్ళగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. శాంతి తండ్రి ముడావత్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని దుర్మరణం

జడ్చర్ల: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన పోలేపల్లి ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శుభమ్ ఆగే(30) పోలేపల్లి సెజ్‌లోని ఓ ఫార్మ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం జడ్చర్లలోని లక్ష్మీ కాలనీలో నివాసం ఉంటూ ఫార్మ పరిశ్రమలో విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలు దేరాడు. పోలేపల్లి శివారులో ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన శుభం ఆగ్‌ను వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. శనివారం అతని సోదరుడు సురజ్ ప్రకాశ్ ఆగే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె గ్రామ సమీపంలో జూరాల ప్రధాన కాల్వలో కొట్టుకొచ్చిన మృతదేహం బోయ మురళీ42)గా గుర్తించినట్లు ఎస్ఐ రాణి శనివారం తెలిపారు. కొత్తకోట మండలం పామ్‌పురం గ్రామానికి చెందిన బోయమురళి ఈ నెల 17న కూలర్ రిపేర్ చేసుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడని, అనారోగ్యంతో పాటు అప్పుడప్పుడు పిట్స్ కూడ వచ్చేవని మృతుడి భార్య సంధ్య తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో జూరాల ప్రధాన కాల్వలో పడడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.



జూరాల నుంచి 23 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

జూరాల వద్ద కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టుకు 1.14లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 23 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టుకు 1.14 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉందన్నారు. దీంతో ప్రాజెక్టు 23 క్రస్టు గేట్లను ఎత్తి 89,378 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి కోసం 28,505 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 66 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1.22 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.279 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాల ఎగువ విద్యుదుత్పత్తి కేంద్రంలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు..

ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 104.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 90,740 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 33.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 94,993 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 25 క్రస్టు గేట్లను ఎత్తి జూరాలకు 95,968 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

8 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి:ఎనిమిది గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 34,488 క్యూసెక్కుల నీటిని దిగువ శ్రీశైలానికి, కేసీ కెనాల్‌కు 2,354 క్యూసెక్కులను వదిలినట్లు ఆయన తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 894 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 32 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

శ్రీశైలానికి మళ్లీ నీటి ప్రవాహం

దోమలపెంట (బ్రహ్మగిరి): జూరాల ఆనకట్ట గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 89,723 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 28,627, సుంకేసుల నుంచి 34,438 క్యూసెక్కులు కలిపి మొత్తం 1.52లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలంకు వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల వద్ద 199.7 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,302 క్యూసెక్కులు మొత్తం కలిపి 67,617 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడుకు 20,000 క్యూసెక్కులు, ఎంజీకేఎల్ఐకు 800, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 1,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 17.569 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 17.403 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అందిస్తాం
- మాజీ ఎమ్మెల్యే హయాంలోనే దేవుడి భూములు మాయం
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, డిసెంబర్ 9లోగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అందిస్తామని కొల్లాపూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి కనీసంగా సర్వే కూడా పూర్తి చేయలేకపోయారని దుయ్యబట్టారు. కానీ తాము ఇప్పటికే జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. అదేవిధంగా ప్యాకేజీ పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. లక్ష్మారెడ్డి మంత్రిగా పనిచేసి కూడా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టలేదని, ఎన్నికల ముందు జీఓలు తీసుకొచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న లక్ష్మారెడ్డి ఎన్ని సబ్‌స్టేషన్లు తీసుకొచ్చారని ప్రశ్నించారు.

రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా..

తమ గ్రామంలో దేవుడి భూమి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదని ధ్వజమెత్తారు. దేవుడి భూమి నుండి వచ్చే ఆదాయమే లేదని, అర్చకులకు సైతం సొంతగా జీతాలు ఇస్తున్నామన్నారు. ఏటా ఉత్సవాలకు సొంతంగా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కోర్టు ఖర్చులు తామే భరించి 120 ఎకరాల భూమిని కాపాడామని గుర్తుచేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

14వ వార్డులోని త్రిషూల్‌నగర్‌లో రూ.1.35 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, కౌన్సిలర్లు చౌహాన్, రమేశ్, రాజు, నాయకులు నిత్యానందం, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్లు పెంచకపోతే సీఎం రాజీనామా చేయాలి'



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

గద్వాలటౌన్: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని, హామీలు అమలు చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం గద్వాలలోని ఓ ప్రైవేటు హాల్‌లో నిర్వహించిన దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సన్నాహాక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లుగా దివ్యాంగులకు రూ.6వేలు, చేయూతకు రూ.4 వేలు, తీవ్ర వైకల్యం ఉన్న వారికి రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ సైతం పింఛన్ల పెంపు హామీని ప్రశ్నించడం లేదని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య, వితంతు పింఛన్లు వంటి పథకాల అమలు ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమేనన్నారు. నాలుగైదేళ్లుగా కొత్త దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల, చేయూత పింఛన్‌దారుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లో మహాగర్జన సభను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, భీమన్న, రాజు, అశోక్, పరశురాం, కన్నా, మోష, ఆంజనేయులు, బాస్కర్, యల్లప్ప, యాగంటి, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం రైతులు చాలా రోజుల తర్వాత క్యూలైన్లు కట్టారు. దీంతో యూరియా సెంటర్ల వద్ద రైతుల పడిగాపులు మొదలయ్యాయి. శనివారం మండల కేంద్రంలోని యూరియా కేంద్రాల్లో రైతులు క్యూ కట్టారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఒక్కసారిగా రైతులు శనివారం ఎరువుల దుఖానాలకు పోటెత్తారు. ఎక్కడ చూసిన అన్నదాత క్యూలైన్లు కనిపించాయి. చాలారోజుల తర్వాత యూరియా కొరత ఉందంటూ రైతులు ఎగబడడంతో పాత రోజులు గుర్తుకొచ్చాయి. దీంతోపాటు పోలీసుల పహారాలో రైతులకు ఎరువులు అందించే పరిస్థితి వచ్చింది. – నవాబుపేట

పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి కృషి



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నట్లు యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ దేవసేన , రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్‌ల సమావేశంలో ఆయన పాల్గొని న్యాక్ యాక్టివిటీస్, బడ్జెట్ ప్రపోజల్స్, యూనివర్సిటీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పీయూలో విద్యార్థులకు వసతుల కల్పన, నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకృష్టారెడ్డి, పీయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, కోఆర్డినేటర్ కరుణాకర్ రెడ్డి , ఈశ్వర్, అర్జున్‌కుమార్, గౌస్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా



జడ్చర్ల ఆస్పత్రిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల నుంచి గంగాపూర్ వైపు వెళ్తున్న ఆటో గంగాపూర్ ఎల్లమ్మ దేవాలయం సమీపంలో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఆటోలో ఉన్న 12 మంది విద్యార్థులు గాయపడ్డారు. వారిలో ఒకరిద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. మిగతా వారిని ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపారు. ప్రమాద సమయంలో ఆటోలో దాదాపు 15 మంది దాకా ఉన్నారు. గాయపడిన వారిని వైద్యం కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో లక్ష్మన్ నాయక్ తండాకు చెందిన విద్యార్థి మధు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. గాయాలైన రాములు, ప్రవళిక, తదితర విద్యార్థులకు జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మరో వృద్ధుడు కృష్ణయ్య కాలుకు తీవ్రంగా గాయమైంది. గాయపడిన వారు మండల పరిధిలోని లింగంపేట, కోడ్గల్ గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. క్షతగాత్రులను స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, తదితరులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

కారు బోల్తా.. ఒకరు మృతి



ప్రమాదానికి గురైన కారు.

ముగ్గురికి తీవ్రగాయాలు



ఓంకార్ నాగిరెడ్డి (ఫైల్)

కొత్తకోట రూరల్: అతివేగంగా వెళ్తున్న కారు ముందు టైర్ పేలి కారు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. కొత్తకోట ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలు.. శనివారం కడుకుంట్ల స్టేజీ సమీపంలో జాతీయ రహదారి 44పై ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా జూపాడ్‌బంగ్లా మండలం లింగాపురం గ్రామానికి చెందిన ఓంకార్ నాగిరెడ్డి(37) భార్య వర్షిణికి వైద్య చికిత్స నిమిత్తం అన్న ప్రభాకర్‌రెడ్డి, ప్రమీలమ్మతో కలిసి స్వగ్రామం నుంచి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కడుకుంట్ల స్టేజీ సమీపంలోకి రాగానే కారు కుడివైపు ముందు టైర్ పేలడంతో కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ డివైడర్ దాటి కర్నూలు వైపు వెళ్లే రోడ్డుపై పడింది. దీంతో కారు నడుపుతున్న ఓంకార్ నాగిరెడ్డికి తల, ఇతర భాగాలకు, మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా ఓంకార్ నాగిరెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి మామ ఉట్కూర్ రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాత కక్షలతో కత్తితో వ్యక్తిపై దాడి



దాడికి గురైన లంబాడి వెంకటేశ్

మరికల్: పాతకక్షలను మనసులో పెట్టుకొని కొబ్బరి బోండాల కత్తితో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటన శనివారం రాత్రి మరికల్‌లో కలకలం రేపింది. ధన్వాడ ఎస్ఐ రాజశేఖర్, మరికల్ ఏఎస్ఐ ఎల్లయ్య కథనం ప్రకారం.. ఐదేళ్ల కిందట జరిగిన వివాహేతర సంబంధం కారణంగా బోండాల మల్లేశ్, లంబడి వెంకటేశ్ మధ్యన తగదాలున్నాయి. అప్పట్లో పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించారు. అయితే లంబడి వెంకటేశ్‌పై ఆగ్రహంతో ఉన్న బోండాల మల్లేశ్ శనివారం రాత్రి 8:27 సమయంలో వెంకటేశ్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రోడ్డు మలుపు వద్ద మాటువేసి ఒక్కసారిగా కొబ్బరి బోండాల కత్తితో దాడిచేయగా.. శరీరం వెనక భాగం, మెడపై తీవ్ర గాయలయ్యాయి. పక్కనే టీస్టాల్ వద్ద ఉన్నవారు పరుగెత్తుకుంటూ రావడంతో మల్లేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా దాడికి గురైన వ్యక్తిని పోలీసులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. దాడి వెనుక వివాహేతర సంబంధమేనని పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉందని ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు.

చిరుత కోసం ముమ్మర గాలింపు

- మరో బోను ఏర్పాటు



టీడీగుట్ట సమీపంలో బోను ఏర్పాటు చేసిన అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా కేంద్రానికి సమీపంలోని టీడీగుట్ట, వీరన్నపేట, గుర్రంగట్టు పరిసర ప్రాంతాల ప్రజలను చిరుత సంచారం భయభ్రాంతులకు గురిచేస్తోంది. చిరుతను పట్టుకునేందుకు పోలీసు, అటవీ శాఖలకు చెందిన బృందాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నా దొరకకపోగా అప్పుడప్పుడూ రాళ్లపై కలియ తిరుగుతూ కనిపించడం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి తెప్పించిన మరో బోనును టీడీగుట్ట ప్రాంతంలో అధికారులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చారు. చిరుతను ఎలాగైనా పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ శివారులో హెచ్ఈసీ కంపెనీలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యూపీకి చెందిన రాజకుమార్(47) శుక్రవారం రాత్రి ఆకస్తాత్తుగా కూర్చున్నచోటే కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి సోదరుడు రాకేష్‌కుమార్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

కలుపు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- పోలీసులు మందలించారని ఠాణా ఎదుటే ఘటన
- వెంటనే తేరుకుని ఆస్పత్రికి తరలించిన పోలీసులు



వీపనగండ్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాముడు

వీపనగండ్ల: పోలీసులు మందలించారని వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాపల రాముడు బొలెరో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. నెలకిందట మండల కేంద్రానికి సమీపంలో బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. బాధిత కుటుంబానికి కొంత నగదును పరిహారంగా ఇచ్చేవిధంగా ఒప్పందం కుదుర్చుకొన్నాడు. ఇంటితోపాటు తల్లిదండ్రుల పేరున ఉన్న పొలం తాకట్టుపెట్టి డబ్బులు సమకూర్చేందుకు యత్నించగా.. తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో శుక్రవారం రాత్రి తల్లిపై చెయ్యి చేసుకోగా విషయం తెలుసుకున్న అతని అక్కాచెల్లెలు రాముడిపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రాముడిని ఠాణాకు పిలిపించి "ఇప్పటికే నీపై కేసు నమోదైంది.. మళ్లీ కుటుంబ సభ్యులపై దాడి చేశావు.. మరోసారి కేసు నమోదు చేసి. జైలుకు పంపించాల్సి వస్తుందని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై స్టేషన్ ఆవరణలోనే కలుపునివారణ మందు తాగి అతని కుమారుడు శ్రీహరికి సైతం తాగించాడు. వెంటనే తేరుకున్న పోలీసులు తండ్రి, కుమారుడిని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఊహించని ఘటన చోటుచేసుకోవడంతో కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి, శ్రీరంగాపురం ఎస్ఐ రామకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి బాధితుడి భార్య చెన్నమ్మతో మాట్లాడి కానిస్టేబుల్‌తో వనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాముడి వద్దకు పంపించారు. ఘటనపై సీఐ రాంబాబును వివరణ కోరగా.. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు రాముడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ రాణి మందలించారు.అంతమాత్రానికే కలుపు నివారణ మందు తాగాడని వివరణ ఇచ్చారు.